సాక్షి నిజామాబాద్

గురువారం ♦ 13 ♦ మార్చి ♦ 2025



చిరుత సంచారం..

నవీపేట మండలం అల్జాపూర్, అబ్బాపూర్ (బి) గ్రామ శివార్లలో చిరుతల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

- 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ గురు : 6:31 | సహర్ శుక్ర: 5:03

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.8 /17.3

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

యూనివర్సిటీ పేరు మార్పు ఉండదు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చబోమని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి తెలిపారు. బుధవారం అసెంబ్లీలో సీఎంను కలిసిన ఎమ్మెల్యే.. తెయూ పేరు మార్పుపై వస్తున్న కథనాలు, వివిధ వర్గాల అభిప్రాయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం తెయూ పేరు మార్పు లేదని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి యోగితారాణాకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే జిల్లాకు మంజూరైన జవహర్ నవోదయను జక్రాన్‌పల్లి మండలంలో ఏర్పాటు చేయాలని సీఎంకు విన్నవించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పసుపు రైతుల అభివృద్ధే బోర్డు లక్ష్యం



పెర్కిట్(ఆర్మూర్): పసుపు రైతుల అభివృద్ధే లక్ష్యంగా పసుపుబోర్డు పనిచేస్తోందని బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం ఆయన పసుపు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో పసుపునకు గిట్టుబాటు ధర లేని సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాస్తే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం ద్వారా రైతులను ఆదుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం నిపుణులు పసుపు ఉత్పత్తిని మెరుగు పరిచేందుకు ఆధునిక పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. అలాగే నాణ్యత ప్రమాణాలు, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను వివరించారు. స్పైసెస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సుందరేషన్, ఫీల్డ్ ఆఫీసర్ రాజ్‌మాణిక్యం, రైతు సంఘాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై ముగిసిన శిక్షణ



డొంకేశ్వర్(ఆర్మూర్): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో డ్రోన్ వినియోగంపై యువ రైతులకు వారం రోజుల పాటు కొనసాగిన ఉచిత శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న 28మంది రైతులకు అధికారులు జిల్లా కేంద్రంలోని జీవ నియంత్రణ ప్రయోగశాలలో సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ తీసుకున్న రైతులు డ్రోన్ ద్వారా ఆదాయాన్ని ఆర్జించాలని ఆత్మ పీడీ కెన్నత్ ప్రవీణ్ సూచించారు. ఇఫ్‌కో మేనేజర్ శివరామకృష్ణ, బీటీఎం భరత్‌కుమార్ పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డుకు వరుస సెలవులు

సుభాష్‌నగర్: నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌కు వరుస సెలవులు ప్రకటించినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న హోలీ, 15న దల్హండి, 16న ఆదివారం కావడంతో మార్కెట్ యార్డులో ఎలాంటి క్రయవిక్రయాలు జరగవని పేర్కొన్నారు. రైతులు పంట దిగుబడులను మార్కెట్ యార్డుకు తీసుకురావొద్దని సూచించారు. 17వ తేదీ నుంచి యథావిధిగా మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు కొనసాగుతాయని తెలిపారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

సుభాష్‌నగర్: నగరంలోని పవర్ హౌజ్ కంపౌండ్‌లో ఉన్న డీ-1 సెక్షన్ కార్యాలయంలో గురువారం 'విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు ఎన్‌పీడీసీఎల్ డీఈ ఎం శ్రీనివాస్ రావు, టౌన్-1 ఏడీఈ ఆర్ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, వినియోగదారుల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా ఉన్న ఎన్టీఆర్ చౌరస్తా



బిడ్డకు ఎండ తగలకుండా చీరకొంగు కప్పిన తల్లి

ముదురుతున్న ఎండలు

ఇంతింతై.. అన్న చందంగా రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతోంది. బుధవారం 37 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మార్చిలోనే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడం ప్రారంభించారు. ఇప్పటికే మధ్యాహ్నం సమయంలో ప్రధాన కూడళ్లలో ప్రజలు కనిపించడం లేదు. తప్పని పరిస్థితుల్లో బయటికి వస్తున్న వారు ఎండ తీవ్రత నుంచి తమనుతాము రక్షించుకుంటున్నారు. బుధవారం నగరంలోని రోడ్లపైకి వచ్చిన వారు ఇలా గొడుగులు, స్కార్ఫ్‌లు కట్టుకుని ప్రయాణించగా 'సాక్షి' క్లిక్ మనిపించింది. ఓ తల్లి తన చంటి బిడ్డను ఎండ నుంచి రక్షించుకునేందుకు చీరకొంగు కప్పింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



సంఘటిత ప్రస్థానం

సంఘటిత కార్యశక్తికి నిలువుటద్దంలా నిలిచే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత వసంతోత్సవాలకు సిద్ధమైంది. ఇందూరు నగరంలోని గాజుల్‌పేట్ దత్త మందిరంలో మొదటిశాఖ ప్రారంభం కాగా.. ప్రస్తుతం 50 బస్తీలకుగాను 56శాఖలు కొనసాగుతున్నాయి. వందేళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు స్వయం సేవక్‌లు సిద్ధమయ్యారు.

- ఆర్‌ఎస్‌ఎస్‌కు వందేళ్లు
- గాజుల్‌పేట్ దత్త మందిరంలో మొదటి శాఖ
- ప్రస్తుతం 50 బస్తీలు.. 56 శాఖలు
- ఈనెల 16న వందేళ్ల మహోత్సవం
- సంఘటన శక్తిని మరోసారి చాటనున్న స్వయం సేవక్‌లు



గతేడాది నగరంలో నిర్వహించిన మహాపథ సంచలన్‌లో స్వయం సేవక్‌లు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వందేళ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) వచ్చే విజయదశమికి 101వ ఏట అడుగు పెట్టనుంది. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద సామాజిక, సాంస్కృతిక సంస్థగా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్‌ను 1925లో విజయదశమి రోజున నాగ్‌పూర్‌లో ఐదుగురు పిల్లలతో కేశవ బలిరామ్ హెడ్గేవార్ స్థాపించారు. తరువాత కొన్ని రోజులకే ఇందూరు నగరంలోని గాజుల్‌పేట దత్తమందిర్‌లో 'ఇందూరు శాఖ'ను ప్రారంభించారు. నగరం విస్తరించిన కొద్దీ సంఘ్ శాఖలు సైతం పెరుగుతూ వచ్చాయి. ఇందూరులో ప్రస్తుతం 50 బస్తీలు ఉండగా, 56 శాఖలు నడుస్తున్నాయి. గతేడాది వరకు 33 శాఖలు ఉండగా ప్రస్తుతం ఏకంగా 56 శాఖలకు ఆ సంఖ్య పెరగడం గమనార్హం. ఈ నెల 16న ఉదయం 7 గంటలకు 56 శాఖల సంగమం నిర్వహించనున్నారు. వందేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకున్న సందర్భంగా ఇందూరు నగరంలోని అన్ని బస్తీల్లో శాఖలతో తెలంగాణలోనే మొట్టమొదటగా సంపూర్ణ సంఘ్ శాఖలున్న నగరంగా అవతరించింది. ప్రపంచ దేశాల్లో విస్తరిస్తున్న హిందుత్వ వాతావరణం, భారతదేశంలో నలుదిక్కులా జాతీయ భావన ప్రవాహం, అయోధ్యలో రామమందిరం, కశ్మీర్‌లో ఆర్టికల్ 370 తొలగింపు వంటి ఎన్నో అసాధ్యాలను సుసాధ్యం చేయడంలో సంఘం పాత్ర అనిర్వచనీయమైందని స్వయం సేవక్‌లు అంటున్నారు. సంఘ్ మూలసూత్రం అయిన సంఘ శాఖ – శాఖ ఆధారంగా వ్యక్తి నిర్మాణం, తద్వారా హిందూ సంఘటన, సంఘటిత హిందూ సమాజం ఆధారంగా భారత్‌ను విశ్వగురు పీఠం నిలపటమే లక్ష్యంగా 100 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం సాగిందని చెబుతున్నారు. కేవలం గంట పాటు నిర్వహించే కార్యక్రమం ద్వారా ఇందూరు సమాజం సంఘటన శక్తి స్వరూపాన్ని చూడొచ్చంటున్నారు. 56 శాఖలను ఒకే చోట, ఒకే సమయంలో కలిపి వైభవంగా సంగమ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఇందూరు నగర శాఖ గిరిరాజ్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు.

నిర్దిష్ట లక్ష్యంతో వందేళ్ల ప్రస్థానం

నగర శాఖల సంగమ కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పూరిలో జగన్నాథుడికి అత్యంత భక్తితో నివేదించే 56 రకాల నైవేద్యాలను ఛప్పన్‌భోగ్ అంటారు. అదే పద్ధతిలో ఇందూరు హిందూ సమాజం భరతమాతకు 56 శాఖల రూపంలో ఒక అపురూపమైన నైవేద్యం సమర్పిస్తుంది. ఈ శాఖల సంగమానికి అందరినీ ఆహ్వానిస్తున్నాం. కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆర్‌ఎస్‌ఎస్ యూనిఫామ్ అవసరం లేదు. ఎవరైనా స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు. కార్యక్రమంలో దక్షిణ మధ్య క్షేత్ర ధర్మజాగరణ ప్రముఖ్ అమర లింగన్న సందేశాన్ని అందజేస్తారు. పిల్లలు, పెద్దలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుతున్నాం.

– అర్గుల సత్యం, నగర కార్యవాహ



మహాపథ సంచలన్‌లో పాల్గొన్న బాల స్వయం సేవక్‌లు (ఫైల్)

డీటీవో ఆఫీస్‌లో ఏసీబీ సోదాలు

- ఓ ఏజెంట్ నుంచి నగదు, ఆర్‌సీలు, మూడు లైసెన్స్‌లు స్వాధీనం
- పలు డాక్యుమెంట్లపై ప్రత్యేక కోడ్



నిజామాబాద్ డీటీవో కార్యాలయం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు నాగారంలోని ఏసీబీ కార్యాలయానికి వెళ్లిన ఏసీబీ అధికారులు ప్రధాన గేటుకు తాళం వేశారు. అనంతరం జిల్లా కార్యాలయంతోపాటు ఆర్టీఏ అధికారుల కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. కౌంటర్ల వద్ద క్యూలో ఉన్నవారిని కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. ఆర్టీఏ ఏజెంట్ ఎండీ ఖలీల్ వద్ద నుంచి రూ.27 వేల నగదుతోపాటు 14 ఆర్‌సీలు, మూడు డ్రైవింగ్ లైసెన్స్‌లు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. తమ సిబ్బంది డ్రైవింగ్, లెర్నింగ్, వాహనాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ దరఖాస్తులను పరిశీలించారని, చాలా వాటిపై ప్రత్యేకంగా కోడింగ్ ఉందన్నారు. అలాగే చాలా మంది ఏజెంట్లు ఆఫీస్‌లోకి వస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆర్టీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదికను అందిస్తామని తెలిపారు. ఎవరైనా అధికారులు లంచం అడిగితే టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేయాలని లేదా 94404 46106 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

వేతనాలు మంజూరు చేయాలి



మోర్తాడ్‌లోని మిషన్ భగీరథ పంప్‌హౌస్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

- మిషన్ భగీరథ అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఏడు నెలలుగా జీతాలు అందడం లేదు
- లైన్‌మెన్, సూపర్‌వైజర్ల ఆవేదన

మోర్తాడ్(బాల్కొండ): మిషన్ భగీరథ పథకంలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న తమకు నెలల తరబడి వేతనాలు అందడం లేదని, లైన్‌మెన్‌లు, సూపర్‌వైజర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ పంప్‌హౌజ్‌ల నిర్వహణ బాధ్యతలను స్వీకరించిన కాంట్రాక్ట్ కంపెనీ ఏడు నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ముఖం చాటేసిందన్నారు. బుధవారం మోర్తాడ్‌లోని పంప్‌హౌస్ ఎదుట అవుట్ సోర్సింగ్ కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందరంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మొత్తం 690 మంది పని చేస్తున్నామని, లైన్‌మన్‌లకు నెలకు రూ.10వేలు, సూపర్‌వైజర్లకు రూ.15వేల చొప్పున వేతనం చెల్లించాల్సి ఉందన్నారు. అయితే బిల్లులు మంజూరు కావడం లేదనే కారణంతో అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కాంట్రాక్ట్ కంపెనీలు వేతనాలు ఇవ్వడం లేదని, ఏడు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోయినా పీఎఫ్ ఖాతాల్లో ప్రావిడెంట్ ఫండ్ జమ చేస్తున్నారన్నారు. వేతనాలు చెల్లించాలని తాము ఇటీవల నీటి సరఫరాను నిలిపివేయగా, కాంట్రాక్ట్ కంపెనీ మేనేజర్ రాజేశ్ తమతో చర్చలు జరిపారన్నారు. వేతనాలు అందిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో నిరసనను వాయిదా వేసి యథావిధిగా నీటి సరఫరా కొనసాగించినట్లు తెలిపారు.

విద్యుత్‌శాఖలో ఎమర్జెన్సీ రీస్టోర్ టీమ్‌లు

సుభాష్‌నగర్: విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయాన్ని తగ్గించడం, యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు ఎమర్జెన్సీ రీస్టోర్ టీమ్‌లను ఏర్పాటు చేశామని సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ) ఆర్ రవీందర్ తెలిపారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్‌లో ఎమర్జెన్సీ రీస్టోర్ టీమ్‌ల ఈఆర్‌టీ వాహనాలను ఎస్‌ఈ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక సమస్యల కారణంగా విద్యుత్ సరఫరాలో తలెత్తే అంతరాయాన్ని తగ్గించేందుకు బ్రేక్ డౌన్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. జీపీఆర్‌ఎస్ లొకేషన్ ఆధారంగా త్వరగా వెళ్లి సమస్య పరిష్కరించేందుకు ఈఆర్‌టీ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. టీమ్‌లో ఆరుగురు సభ్యులు 24 గంటలపాటు అందుబాటులో ఉంటారన్నారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఈ రవీందర్

ట్రాఫిక్ నియంత్రణకు నుడా నిధులు

- నిజామాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ జోన్‌గా మార్చాలి
- నుడా చైర్మన్ కేశవేణు



ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడుతున్న కేశ వేణు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నగరంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యల కోసం నుడా నుంచి నిధులు కేటాయించనున్నట్లు చైర్మన్ కేశవేణు తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐ ప్రసాద్‌తో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. బస్టాండ్ ఏరియా, ఖలీల్‌వాడి, బోధన్ బస్టాండ్, హైదరాబాద్ రోడ్డు, కంఠేశ్వర్, వినాయక్ నగర్, రాజరాజేంద్ర చౌరస్తా, వర్ని చౌరస్తా తదితర ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు సూచించేలా బోర్డులు, జంక్షన్‌ల వద్ద క్యాబిన్‌లు, సిగ్నల్స్ వ్యవస్థ ఆధునీకరణ తదితర అత్యవసర పనుల కోసం అవసరమైన నిధులను నుడా ద్వారా కేటాయిస్తామని వేణు తెలిపారు. నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ జోన్‌గా మార్చాలని ఏసీపీకి సూచించారు.

ఔషధ, సుగంధ ద్రవ్యపంటలను సాగుచేయాలి

- తెయూ వీసీ యాదగిరిరావు
- సాగు పద్ధతులు, మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న వీసీ యాదగిరిరావు



ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డికి నిమ్మగడ్డి, కాష గడ్డి విత్తనాలు అందజేస్తున్న సీ మ్యాప్ శాస్త్రవేత్త డాక్టర్ జ్ఞానేశ్వర్

తెయూ(డిచ్‌పల్లి): దేశ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతతో ముందుకు వెళ్లాలంటే వ్యవసాయ రంగంలో ఔషధ, సుగంధ ద్రవ్యపంటలను సాగుచేయాలని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు అన్నారు. కేంద్రీయ ఔషధ, సుగంధ ద్రవ్యమొక్కల పరిశోధన కేంద్రం (సీ–మ్యాప్) హైదరాబాద్ ఆధ్వర్యంలో తెయూలో బుధవారం ఔషధ, సుగంధ మొక్కలు, వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వీసీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్షేత్రస్థాయిలో నూతన మార్పులను ఆవిష్కరిస్తూ సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులను తగ్గిస్తూ, సుగంధ ద్రవ్యాలు, వాణిజ్య పంటలను ప్రోత్సహించాలన్నారు. రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. రైతులు యూనివర్సిటీకి వచ్చి శాస్త్రవేత్తలతో, అధ్యాపకులతో అనుభవాలు పంచుకోవడం ద్వారా వ్యవసాయ రంగంలో గుణాత్మకమైన మార్పులు వస్తాయన్నారు. శాస్త్రవేత్త జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ఔషధ, సుగంధ ద్రవ్యమొక్కల సాగుతో రైతులకు ఆర్థిక ప్రయోజనాలతో పాటు ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనంతరం నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డికి సీ–మ్యాప్ శాస్త్ర వేత్త జ్ఞానేశ్వర్ నిమ్మగడ్డి విత్తనాలను అందజేశారు. పసుపులో నూతన వంగడాల సాగుపై ఏఎంసీ ఆధ్వర్యంలో త్వరలో అవగాహన కల్పిస్తామని గంగారెడ్డి అన్నారు. వాసం చంద్రశేఖర్, మావురపు సత్యనారాయణరెడ్డి, శిరీష బోయ పాటి, ప్రొఫెసర్ అపర్ణ, అధ్యాపకులు పున్నయ్య, కిరణ్మయి, మహేందర్, నాగరాజు, సాయిలు, గంగాకిషన్, కిరణ్ రాథోడ్, నర్సయ్య, శరత్, వైవీవీఎస్ స్వామి, రైతులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి సునీత కుంచాల

నిజామాబాద్‌నాగారం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, పురుషులతో సమానంగా పోటీ పడాలని జిల్లా జడ్జి సునీత కుంచాల పిలుపునిచ్చారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో బుధవారం జిల్లా సంక్షేమశాఖాధికారి రసూల్‌బీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి హాజరై మాట్లాడారు. ప్రతి మహిళ విద్య, క్రీడలు, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో అభివృద్ధిని సాధించాలన్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లితే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. జిల్లాస్థాయిలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన మహిళలను సత్కరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, అడిషనల్ కలెక్టర్ అంకిత్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, మహిళ కమిషన్ సభ్యులు సూదం లక్ష్మీ, డీఎంహెచ్‌వో రాజశ్రీ, బీసీ సంక్షేమ అధికారిణి స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రూప్-2లో మెరిసిన మగ్గిడి వాసి


దాస గంగాధర్

పెర్కిట్: ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన దాస గంగాధర్ మంగళవారం విడుదల చేసిన టీజీపీఎస్సీ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 102 ర్యాంకు, బాసర జోన్ పరిధిలో 8వ ర్యాంకు, బాసర ఎస్సీ కమ్యూనిటీలో మొదటి ర్యాంకు సాధించాడు. మగ్గిడి గ్రామానికి చెందిన దాస చిన్న గంగారాం, దాస రాజు దంపతుల కుమారుడు గంగాధర్ పదో తరగతి వరకు స్థానిక పాఠశాలలో చదివాడు. భిక్కనూరు గురుకుల పాఠశాలలో 2013లో ఇంటర్, ఆర్మూర్ పట్టణంలోని నరేంద్ర డిగ్రీ, పీజీ కళాశాలలో బీఎస్సీ ఎంపీసీఎస్, ఎమ్మెస్సీ మ్యాథ్స్ పూర్తి చేశాడు. 2024లో గ్రూప్-4 ద్వారా నిజామాబాద్ డిస్ట్రిక్ట్ ట్రెజరి ఆఫీస్‌లో జూనియర్ అకౌంటెంట్‌గా కొలువు సాధించాడు. అలాగే గ్రూప్-2 ఫలితాల్లో సైతం ఉత్తమ ర్యాంకు సాధించాడు. తమ కుమారుడు ఉత్తమ ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి నీటిచుక్కను సద్వినియోగం చేసుకోవాలి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా విడుదలవుతున్న ప్రతి నీటి చుక్కనూ ఆయకట్టు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి, ఏఈఈ రవి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం నీటినిల్వ బోటాబోటిగా ఉన్న నేపథ్యంలో నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని, ఏప్రిల్ 9వరకు నీటి విడుదల ఉంటుందని అన్నారు. ఆలోగా పంటలు గట్టెక్కేలా రైతులు ప్రణాళిక రూపొందించుకోవాలని, ఆయకట్టు రైతులు ప్రాజెక్ట్ అధికారులకు సహకరించాలని వారు కోరారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లావ్యాప్తంగా బుధవారం ఇంటర్ సెకండియర్ బోటనీ, పొలిటికల్ సైన్స్, మ్యాథ్స్-2ఏ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ తెలిపారు. జిల్లాలో మొత్తం 17,064 మందికి 16,587 మంది పరీక్షలు రాయగా 477 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. బోధన్‌లోని విజేత జూనియర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు చీటీలు రాస్తుండగా చీఫ్ సూపరింటెండెంట్ పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశారన్నారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 51 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ రంగంలో ఉచిత శిక్షణకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఒక నెల నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ప్రయివేట్ బ్యాంకుల్లో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తయి, 26ఏళ్ల లోపు వయసున్నవారు అర్హులన్నారు. ఆసక్తిగల బీసీ అభ్యర్థులు ఈనెల 15నుంచి వచ్చే నెల 8లోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 12న అభ్యర్థులకు ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 08462-241055ను సంప్రదించాలన్నారు.

'నిజాంసాగర్ కెనాల్ వైపు వెళ్లొద్దు'

నిజాంసాగర్: యాసంగి పంటల అవసరాల నిమిత్తం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తున్నందున ఎవరూ కెనాల్‌వైపు వెళ్లవద్దని నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ సూచించారు. గురువారం నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రధాన కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉండనున్న నేపథ్యంలో కాలువలోకి వెళ్లి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని సూచించారు.

వర్సిటీ పేరు మారిస్తే ఊరుకోం

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రతిపాదనపై విద్యార్థుల ఆగ్రహం
- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- వీసీకి వినతిపత్రాలు అందజేసిన విద్యార్థి సంఘాలు


తెలంగాణ యూనివర్సిటీలో వీసీకి వినతిపత్రం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నుంచి వచ్చిన ప్రతిపాదనలపై వర్సిటీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, కాంట్రాక్టు అధ్యాపకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పూర్వ విద్యార్థుల సంఘం, ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్, కాంట్రాక్టు అధ్యాపకులతో పాటు రెగ్యులర్ అధ్యాపకులు సైతం వర్సిటీ పేరు మార్పు సరైన నిర్ణయం కాదని విమర్శిస్తున్నారు. బుధవారం ఉదయం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీగా వచ్చి పరిపాలనా భవనాన్ని ముట్టడించారు. కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. యూనివర్సిటీ పేరును మారిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృతచారి మాట్లాడుతూ.. ఎందరో విద్యార్థుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. యూనివర్సిటీ పేరు మారిస్తే సీఎం రేవంత్‌రెడ్డి చరిత్ర హీనులుగా మిగిలిపోతారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ పేర్కొన్నారు.

తెయూ పేరు మార్చడమంటే తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని దెబ్బతీయటమేనని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చే బదులు క్యాంపస్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీను ఏర్పాటు చేసి ఈశ్వరీబాయి పేరు పెట్టుకోవాలని వర్సిటీ పూర్వ విద్యార్థులు యెండల ప్రదీప్, శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు వీసీకి, రిజిస్ట్రార్‌కు వినతిపత్రా లు అందజేశారు. తెలంగాణ పేరు సున్నితమైన, భావోద్వేగాలతో కూడుకున్నదని ఈ పేరు మారిస్తే ప్రజల మనోభావాలు దెబ్బతినే అవకాశాలున్నాయని వీసీ టి యాదగిరి రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. వర్సిటీ పేరు మార్పు ప్రతిపాదనను వర్సిటీ విద్యా


ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

ర్థులు, అధ్యాపకులు, జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యామండలికి లేఖ ద్వారా తెలియజేస్తామని వీసీ పేర్కొన్నారు.

ఎమ్మెల్యే సవాల్‌కు సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి

- చర్చకు ఏ ఇటుకబట్టీకి రావాలో చెప్పాలి
- ఎంపీ అర్వింద్ ఆదరణను ఓర్వలేక విమర్శలు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి

సుభాష్‌నగర్: నవోదయ విద్యాలయం ఏర్పాటు విషయంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి అన్నారు. బుధవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా వచ్చే ఆదివారం ఏ అంశంపైన అయినా చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, సవాల్‌పై చర్చకు ఏ ఇటుకబట్టీకి రావాలో చెప్పాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ అర్వింద్ రెండు నవోదయలను మంజూరు చేయించారని తెలిపారు. జిల్లా అభివృద్ధికి అర్వింద్ కృషి చేస్తున్నారని, ఆయన ఆదరణను ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

పసుపు రైతులు, బోర్డు గురించి మాట్లాడే అర్హత భూపతిరెడ్డికి లేదని, ధర తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోతుంటే.. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎలాంటి చర్యలు చేపడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ పేరును ప్రభుత్వం మారిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు, మాజీ కార్పొరేటర్లు న్యాలం రాజు, స్రవంతిరెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి, అంబదాస్‌రావు, ప్రమోద్‌కుమార్, బద్దం కిషన్, గంగాధర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిఖిలేశ్‌కు భరోసానివ్వండి

- చికిత్సకు సాయం చేయాలని సీఎంకు విన్నవించిన ఆర్మూర్ ఎమ్మెల్యే

వేల్పూర్: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో లుకేమియా అనే క్యాన్సర్ వ్యాధి సోకిన విద్యార్థి నిఖిలేశ్ చికిత్సకు సాయం చేయాలని 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితమైన కథనాన్ని యాష్ టాగ్ తెలంగాణ సీఎంవో అని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి తన వ్యక్తిగత ఎక్స్ లో బుధవారం పోస్ట్ చేశారు. చిరుప్రాయంలోనే ప్రాణాంతక వ్యాధి అనే శీర్షికన నిఖిలేశ్‌కు సోకిన క్యాన్సర్ వ్యాధిపై 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీనిని చూసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డి దయచేసి చికిత్సకు సహాయం చేయాలంటు ఎక్స్‌లో విన్నవించారు.

7లోగా వేతనాలు చెల్లించాలి

- కంపెనీలను ఆదేశించిన కువైట్ ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు

మోర్తాడ్(బాల్కొండ): తమ దేశంలోని కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆయా కంపెనీల యాజమాన్యాలు ప్రతినెలా 7వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని కువైట్ ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయాన్ని కార్మిక సంఘాల ప్రతినిధులు 'సాక్షి'తో తెలిపారు. కువైట్‌లో కొన్ని కంపెనీలు కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ సకాలంలో వేతనాలు చెల్లించడం లేదన్న ఆరోపణలున్నాయి. కొన్ని సంస్థలు రెండు, మూడు నెలల వేతనాలు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై అక్కడి ప్రభుత్వం దృష్టి సారించింది. కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలని ఆదేశించింది. కార్మికులు పనిచేసే చోట ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స అందించడానికి సత్వర చర్యలు చేపట్టాలని సూచించింది. ప్రథమ చికిత్స కిట్‌లను అందుబాటులో ఉంచడంతో పాటు 200ల మంది కార్మికులకు వైద్య చికిత్సలు అందించడానికి ఒక నర్స్‌ను నియమించాలని ఆదేశించింది. కార్మిక చట్టాలను పక్కాగా అమలు చేయడంపై కువైట్ సర్కారు దృష్టి సారించడంతో వలస కార్మికులకు మేలు జరుగుతుందని వలస కార్మిక సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోస్టల్ ద్వారా రాములోరి తలంబ్రాలు

నిజామాబాద్ రూరల్: శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలోని సీతారాముల వారి కల్యాణోత్సవ తలంబ్రాలను తపాలశాఖ ద్వారా భక్తులకు అందించేలా సేవలను ప్రారంభించినట్లు పోస్టల్ శాఖ నిజామాబాద్ సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం ఈ సేవలను రాష్ట్ర దేవాదాయ శాఖతో ఒప్పందం చేసుకొని ముందుకు తీసుకువచ్చామని పేర్కొన్నారు. స్పీడ్ పోస్టు ద్వారా తలంబ్రాలు 10 గ్రాములు, ఒక ముత్యం, పసుపు, కుంకుమ, మిస్త్రీ, కాజు, 80 గ్రాముల ప్రసాదం కోసం భక్తులు తమ దగ్గరలోని పోస్టాఫీసుకు వెళ్లి రూ.450 చెల్లించి బుక్ చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 1 వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

చిరుత సంచారం.. ప్రజల్లో కలవరం

- అధికారులు బంధించాలంటున్న అబ్బాపూర్, అల్జాపూర్ గ్రామస్తులు
- సంచార ప్రదేశాలను పరిశీలించిన అటవీశాఖ అధికారులు

నవీపేట: నవీపేట మండలం అల్జాపూర్, అబ్బాపూర్(బి) గ్రామాల్లో చిరుత పులుల సంచారం చుట్టు పక్కల గ్రామాల ప్రజలను కలవరపెడుతోంది. మండలంలోని వివిధ గ్రామాలు గుట్టలకు ఆనుకుని ఉండడంతో అటవీ జంతువులు జనవాసాల మధ్య సంచరిస్తున్నాయి. రెండు రోజుల క్రితం అల్జాపూర్-యంచ గ్రామాల మధ్య చెరువుకు తాగునీటి కోసం రెండు చిరుతలు రాగా శివారులో ఉన్న రైతులు భయాందోళనకు గురయ్యారు. గతంలో ఇదే ప్రాంతంలో చిరుత దాడిలో మేకలు మృత్యువాత పడ్డాయి. మళ్లీ కనిపించడంతో అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు భద్రతా చర్యలు చేపట్టారు. నందిగామ-అల్జాపూర్-యంచ గ్రామాలను ఆనుకుని ఉన్న గుట్టల్లో రోడ్లు దాటుతూ రెండు చిరుతలు సంచరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


అబ్బాపూర్(ఎం)లో చిరుత దాడిలో మృతిచెందిన ఆవును పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

అబ్బాపూర్ గుట్టల్లో నాలుగు చిరుతలు

నెల రోజుల క్రితం మండలంలోని అబ్బాపూర్(ఎం) శివారులోని గుట్ట అంచున ఉన్న పశువుల పాకపై చిరుత దాడి చేసి రెండు ఆవులను చంపేసింది. ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల పరిధిలోని పలు గ్రామాలను ఆనుకుని దట్టంగా ఉన్న అడవిలో చిరుతలు, దుప్పిలు, అడవి పందులు, ఇతర జంతువులు ఉన్నట్లు గతంలో అధికారులు గుర్తించారు. మరో నాలుగు చిరుతలు ఈ దట్టమైన ప్రాంతంలో ఉన్నాయని తెలిపారు. మోకన్‌పల్లి శివారులోని చిన్నపాటి గుట్ట సమీపంలోని ఉన్న ఇటుక బట్టీ దగ్గర ఏడాది క్రితం కనిపించిన తల్లీ, పిల్ల చిరుతలను చుట్టు పక్కల గ్రామాల వాసులను భయభ్రాంతులకు గురి చేశాయి.

దాడి తీవ్రమైతే బంధిస్తాం

మండలంలోని అబ్బాపూర్(ఎం), అల్జాపూర్ గ్రామాల అటవీ ప్రాంతంలో చిరుతలు సంచరిస్తున్నాయి. దట్టమైన అబ్బాపూర్ అటవీ ప్రాంతంలో నాలుగు చిరుతలు, అల్జాపూర్ శివారులో జంట చిరుతలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని చిరుతలు ఇంత వరకు మనుషులపై దాడి చేయలేదు. చిరుతల దాడి తీవ్రమైతే బంధిస్తాం.

– జెహ్రూ, సెక్షన్ ఆఫీసర్ (నిజామాబాద్ రేంజ్)

తాగిన మైకంలో ఏఆర్ కానిస్టేబుల్ వీరంగం

తమ్ముడి భార్య, పిల్లలపై దాడి

భిక్కనూరు: తాగిన మైకంలో ఏఆర్ కానిస్టేబుల్ వీరంగం సృష్టించాడు. ఘటనకు సంబంధించి ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన సంతోష్‌గౌడ్ ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. ఆస్తి పంపకాల విషయంలో ఏఆర్ కానిస్టేబుల్ సంతోష్, సోదరుడు వేణుతో తరచూ గొడవ జరిగేది. వీరి నివాసాలు పక్కపక్కనే ఉంటాయి. తాగిన మైకంలో ఉన్న సంతోష్ తల్లిదండ్రులతో ఆస్తి పంపకాల విషయమై గొడవ పడుతూ ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేశాడు. అదే సమయంలో ఓ స్కూల్‌లో ఉపాధ్యాయులిగా పనిచేస్తున్న తమ్ముడి భార్య నవ్య ఇంటికి చేరుకుంది. గొడవ జరుగుతున్న విషయాన్ని సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తుండగా విషయాన్ని గమనించిన ఆయన కోపంతో కర్రతో ఆమెపై, పిల్లలపై దాడి చేశాడు. ఆమె సెల్‌ఫోన్‌ను కిందపడేశాడు. ఇంట్లో వేణు లేకపోవడంతో స్థానికులు అతనికి ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో అతను స్నేహితుడు సతీశ్‌గౌడ్‌తో కలిసి ఇంటికి కారులో వచ్చారు. తన భార్యను కొట్టడంతో ఆగ్రహించిన వేణు, అన్నపై దాడికి యత్నించాడు. కోపంలో సంతోష్‌గౌడ్ అక్కడే ఉన్న కారు అద్దాలను ధ్వంసం చేశాడు. దీంతో అన్నదమ్ములు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో సంతోష్ కింద పడడంతో తలకు గాయమైంది. సంతోష్‌గౌడ్, మరదలు నవ్య స్థానిక పీఎస్‌లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. నవ్య ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ సంతోష్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగిసిన అంతర్ జిల్లాల యువ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం

డిచ్‌పల్లి: కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర, మేరా యువ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించే అంతర్ జిల్లాల యువ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం జిల్లాలో బుధవారం విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్‌కు చెందిన ఎంపిక చేయబడిన 30 మంది యువతీ యువకుల బృందం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చరిత్రాత్మక ప్రదేశాలు, దర్శనీయ స్థలాలు, కర్మాగారాలను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న యువతీ యువకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్, ఎస్‌బీఐ శిక్షణ సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహేశ్, ప్రభుత్వ అధికారులు, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.


ఆలయం ఎదుట యువబృందం సభ్యులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి


హన్మాండ్లు(ఫైల్)

ఖలీల్‌వాడి: నగరంలోని పులాంగ్ చౌరస్తా వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయుర్వేద వైద్యుడు హన్మాండ్లు(52) మృతి చెందినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నందిపేట్ మండలం తల్వేదకు చెందిన ఆయుర్వేద వైద్యుడు హన్మాండ్లు నగరంలోని గోల్‌హనుమాన్‌వద్ద వాసవి ఆయుర్వేద ఆస్పత్రిని నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం వినాయక్‌నగర్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా పులాంగ్ చౌరస్తా వద్ద సిగ్నల్ ప్రాంతంలో టిప్పర్ ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ హన్మాండ్లును స్థానికులు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అదే బైక్‌పై ఉన్న మరో వ్యక్తి శ్రీహరికి స్వల్ప గాయాలయ్యాయి. శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ ..

మాక్లూర్: కుటుంబ కలహాలతో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మాక్లూర్ మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన దుంపల సాయమ్మ(45) ఈనెల 6న భర్తతో గొడవపడి క్షణికావేశంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు వెంటనే మంటలను ఆర్పివేసి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వాహనం ఢీకొని జింక మృతి



బోధన్‌రూరల్: బోధన్ మండలం రాంపూర్, కల్దుర్కి రాజన్న చౌరస్తా వద్ద బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు బోధన్ రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసు సిబ్బంది జింకకు నీరు తాగించినా కోలుకోలేదని, కొద్ది సేపటికి మృతి చెందిందని స్థానికులు తెలిపారు. పోలీసులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కమ్మర్‌పల్లి: మండల పరిధిలోని గాంధీనగర్‌లో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి బుధవారం తెలిపారు. కడమంచి రవి అనే వ్యక్తి ఓ వాహనంలో రేషన్ బియ్యాన్ని నిల్వ చేశాడనే సమాచారం మేరకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యం మూడు టన్నులు ఉంటుందని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ నలుగురికి రెండు రోజుల జైలు శిక్షను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ బుధవారం తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి నడిపిన 17 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వీరికి నగరంలోని ట్రాఫిక్ పీఎస్‌లో కౌన్సెలింగ్ ఇచ్చి జడ్జి ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు. జడ్జి నలుగురికి రెండు రోజుల జైలు శిక్షను, 13 మందికి జరిమానా విధించినట్లు వెల్లడించారు.

బైక్ దహనం

ఎడపల్లి: మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున ఓ బైక్‌ను దుండగులు దహనం చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎడపల్లికి చెందిన చింటు తన బైక్‌ను తన ఇంటి ఎదుట నిలిపి నిద్రించాడు. ఉదయం 3 గంటల ప్రాంతంలో దుండగులు బైక్‌కు నిప్పంటించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మూడు షాపులు దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: షార్ట్‌సర్క్యూట్‌తో మూడు షాపులు దగ్ధమైన ఘటన పెర్కిట్ పరిధిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పెర్కిట్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న కిరాణషాప్, ఆటోమొబైల్‌షాప్, హోటల్ దుకాణాల నుంచి ఉదయం పొగలు వస్తున్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. మూడు దుకాణాల్లో ఉన్న సామగ్రి అగ్నికి ఆహుతైంది. జిల్లా అగ్నిమాపక అధికారి పరమేశ్వర్, అగ్నిమాపక అధికారి మధుసూదన్ రెడ్డి, ఆర్మూర్ పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ. 24 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు బాల్‌రాజ్, గోపాల్, ముగ్దుమ్ తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

కోటగిరి సీహెచ్‌సీ పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న అధికారి శ్రీనివాస్ ప్రసాద్

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను బుధవారం జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి శ్రీనివాస్ ప్రసాద్ సందర్శించారు. ఆస్పత్రిలో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి.. ఏయే సమస్యలు ఉన్నాయనే వివరాలు తెలుసుకున్నారు. నేషనల్ క్వాలిటీ అస్సూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించారు. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి వైద్యురాలు సుప్రియ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి


వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారులు

ఆర్మూర్‌టౌన్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్(సీజీఆర్‌ఎఫ్) ఎరుకల నారాయణ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని విద్యుత్ ఏఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది 24గంటల పాటు వినియోగదారులకు అందుబాటులో ఉండాలన్నారు. వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు రామకృష్ణ, లకావత్‌కిషన్, రాజగౌడ్, రాజేశ్వర్, రాజేశ్వర్‌రావు, కృష్ణ, లైన్‌మన్‌లు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితురాలి అరెస్టు


మాట్లాడుతున్న సీఐ రవీందర్‌నాయక్

ఎల్లారెడ్డి: వృద్ధురాలి మెడలో నుంచి బంగారం చోరీ చేసిన కేసులో నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. స్థానిక పీఎస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన కాశవ్వ అనే వృద్ధురాలు ఈనెల 9న ఎల్లారెడ్డికి వారాంతపు సంతకు వచ్చింది. స్వగ్రామానికి వెళ్లేందుకు స్థానిక పెట్రోల్ బంక్ వద్ద ఆటో కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఎల్లారెడ్డికి చెందిన ఏసవ్వ వృద్ధురాలితో మాటలు కలిపింది. తాను కూడా అటు వైపే వెళ్తున్నానని అంబేడ్కర్ చౌరస్తా వద్ద తక్కువ రేటుకు ఆటోలు వస్తాయని చెప్పి చర్చి కాంపౌండ్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లింది. అక్కడ కాశవ్వ కంట్లో కారంపొడి చల్లి ఆమె మెడలో ఉన్న రెండు తులాల గుండ్లు, రెండున్నర తులాల పుస్తెల తాడును ఎత్తుకెళ్లింది. మరుసటి రోజు కాశవ్వ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బుధవారం గాంధీచౌక్ ప్రాంతంలో ఏసవ్వ అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను పట్టుకున్నారు. బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు ఏసవ్వ ఒప్పుకోవడంతో ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై మహేశ్, సిబ్బంది అనిల్‌గౌడ్, అర్చన తదితరులు పాల్గొన్నారు.